

# ఒకనాటి కథ

యం.డి.ఆర్. రత్నం

**1968లో —**

ఎయిర్‌ఫోర్స్‌లో ఉన్నాను-

ట్రాన్స్‌ఫర్ మీద బొంబాయి గ్రీన్ కాటన్ నుండి బెంగుళూరు హెబ్బాళకు వచ్చిపడ్డాను. చుట్టూ కాంపౌండ్, లోన బృందావనంలాంటి అందమైన వుద్యాన వనాలు, మధ్య బ్రహ్మాండమైన ట్రైయినింగ్ కమాండ్ భవనాలు— మరో ప్రపంచంలో వున్నట్లుండేది.

రోజూ ఉదయాన్నే పిటీకి వెళ్ళడం, రేషన్ సప్లయిల మీద అజమాయిషీ చెయ్యడం నా పని, మేక్రీ సర్కిల్ బస్ నెంబరు 22, రస్సెల్ మార్కెట్ — నా దినచర్యలో ప్రధాన భాగాలు.

మే నెలలో-

ఆంధ్ర అంతటా తలలు బద్దలయేలా ఎండలు. కాని బెంగుళూరులో ఆహ్లాద కరమైన చల్లని వాతావరణం.

ఒకనాడు-

ఉదయాన్నే లేచి డ్రెస్ చేసుకుని మేక్రీ సర్కిల్‌కు వెళ్ళి బస్‌కోసం నిల్చున్నాను. రెండవ నెంబరు బస్ ఆగి ఉంది. బస్‌స్టాప్‌లో రద్దీ లేదు. నలుగు రైదుగురు కాన్వెంట్ పిల్లలు నీట్‌గా యూనిఫారంలో ఒక ప్రక్క నిల్చుని ఉన్నారు టకటక ఇంగ్లీషు మాట్లాడేస్తూ.

"హల్లో! శేఖర్! గుడ్ మార్నింగ్" పణిక్కర్ బస్‌లోంచి పలుకరించాడు.

"వెరీ గుడ్‌మార్నింగ్!... వేర్ టు" అన్నాను.

"శివాజీనగర్. గోయింగ్ టు రస్సెల్ మార్కెట్?" నవ్వాడు. ఎప్పుడూ నవ్వుతూ మాట్లాడ్డం పణిక్కర్‌కు అలవాటు. అందుకనే అతనంటే అందరికీ యిష్టం.

"యస్."

కండక్టర్ బెల్ కొట్టాడు. బస్ ఎక్కి పణిక్కర్ ప్రక్కన కూర్చున్నాను. నా బస్ 22 రాలేదు. దీనిలో వెళితే ఆర్.యస్ స్టాప్‌లో దిగాలి. అయినా ఫరవాలేదు. అందాకా పణిక్కర్‌తో కబుర్లు చెప్పుకోవచ్చు.

బస్ కదిలింది. హడావిడిగా ఆరేళ్ళ అమ్మాయి వచ్చి బస్ ఎక్కింది.

వెనక్కి తిరిగి తొంగిచూస్తూ,

"అమ్మా! రావే... తొందరగా" అంది తెలుగులో.

ఏళ్ళ తరబడి తెలుగుగడ్డకు దూరంగా ఉన్నాను. ఎక్కడ తెలుగు పలుకులు విన్నా మనసు పరవశించేది చెవులు రిక్కించుకు వినేదాన్ని.

కుతూహలంగా ఆ అమ్మాయికేసి చూశాను. అంతలోనే ఆ పిల్ల వెనక్కి తిరిగి బస్ దిగబోయింది. పడుతుందని ఒడిసి పట్టుకున్నా.

"అమ్మ... అమ్మ" ఏడుపు మొహం పెట్టింది.

"అరె. డ్రైవర్‌సాబ్! ఠాకరో భాయ్! బచ్చీకి మా ఆరహీ హై!" అరిచాను.

డ్రైవర్ నావైపు చూసి వెంటనే బస్ ఆపాడు. మరు నిముషంలో ఆ అమ్మాయి తల్లి—కాబోలు—రొప్పుతూ వచ్చి బస్ ఎక్కింది. బస్ బయలుదేరింది.

అమ్మాయి కుందనపు బొమ్మలా ఉంది. దేవకన్యలా తెల్లని డ్రెస్ వేసుకుంది. అందమైన జుత్తు ముడికి ఎర్ర రిబ్బన్ కట్టి ఉంది... పాలబుడగల్లాంటి బుగ్గలు. ముద్దు పెట్టుకోవాలనిపించింది. నా చేతుల్లోంచి విడిపించుకుని వాళ్ళమ్మ వద్దకు - అదే ఆమె వద్దకు—వెళ్ళింది.

'ఆమె'కేసి చూశాను.

'ఎంత అందంగా ఉంది!' మనసు అంటోంది. స్నిగ్ధ జ్యోత్స్నలా వెల్లి విరిసే నిర్మలముగ్ధమోహన సౌందర్యం, ప్రశాంతమైన ఆ మోము వికసించిన పద్మంలా తళుకులు విరజిమ్ముతూంది.

అమ్మాయిని దగ్గరకు తీసుకుంటూ

ఆమె ఒక్కసారి నాకేసి చూసి తలదించు కుంది.

'ఎంత అందమైన కళ్ళు!' మళ్ళీ అంటోంది మనస్సు.

పణిక్కర్ ఏదో అంటున్నాడు. పర ధ్యానంగా వింటున్నా!..

ఆర్.యస్. బస్‌స్టాప్ వచ్చింది. దిగాము.

"విల్ మీట్ యు అగేన్."

పణిక్కర్ గబగబా స్టేషన్ కేసి వెళ్ళాడు.

ఆమె, అమ్మాయి దిగారు. వసంత నగర్‌కేసి వెళ్తున్నారు. అమ్మాయి నా వైపు చూపించి ఏదో అంటూంది. ఆమె నాకేసి చూసింది. చటుక్కున తలదించు కొని అమ్మాయి చేయి పట్టుకుని వెళ్ళి పోయింది.

.........

మువ్వయ్యేళ్ళు దాటుతున్న బ్రహ్మ చారిని నేను. ఆమె వివాహిత. ఒక అమ్మాయికి తల్లి... మరి...మరి... ఎందుకీ ఆకర్షణ? ఏమో? అర్థంకాలేదు.

* * *

రెండు నెలలు గడిచాయి.

రోజూ ఆమె, అమ్మాయి అదే బస్‌లో వస్తున్నారు. నా బస్ 22. కాని ఎందుకో 2వ నెంబరు బస్‌లో వెళ్తున్నా. మా పరిచయం అంతకుమించి పెరగలేదు. ఎప్పుడో కాని ఆమె నాకేసి చూడదు. చూసినా వెంటనే తలదించుకుంటుంది. నా కళ్ళు ఆమె ప్రతి కదలికను గమనించేవి.

డిఫెన్సు సర్వీసెస్ థియేటర్‌లో తెలుగు సినిమా వచ్చింది. అడ్వాన్సు బుకింగ్‌లో ఫస్ట్‌క్లాస్ టిక్కెట్ కొని ఉంచుకున్నాను. ఆరూ ఇరవైకి హాలు వద్దకు వెళ్ళాను.

ఎంట్రెన్సు వేపు వెళ్తూ ఆగిపోయాను.

ఆమె!

బుకింగ్‌వద్ద క్యూలో నిల్చుని ఉంది. ప్రక్కనే చేయి పట్టుకుని అమ్మాయి!

ఆమెకేసి చూస్తూ నిల్చున్నాను.

పదిరూపాయిల నోట్ తీసి యిచ్చి "టూ సెకండ్ క్లాస్" అంది.

"ట్వంటీ పైసే దీజియే" టిక్కెట్లు తీస్తూ అన్నాడు బుకింగ్ క్లార్కు.

ప్రక్కనే నిల్చున్న ఆర్డర్లీ తెలుగులో చెబుతున్నాడు.

"ఇరవై పైసలు ఇవ్వండి. ఎనిమిది రూపాయలు వాపస్ ఇస్తారు."

ఆమె బెదురుగా చూసింది.

"చిల్లరలేదు" అంది మెల్లగా.

బుకింగ్ క్లార్కు నిర్లక్ష్యంగా పది రూపాయిల నోట్ ఆమెకేసి విసిరి,

"నెక్స్టు" అన్నాడు

క్యూ పెద్దగా ఉంది. ఆమె ప్రక్కకు వస్తే ఇక సినిమా చూడ్డం పడదు. టైమ్ కూడా ఐదు నిముషాలే ఉంది. ఆ చుట్టు ప్రక్కల ఎక్కడా చిల్లర దొరకదు.

చొరవగా ముందుకువెళ్ళి జేబులోంచి ఇరవై పైసాలుతీసి బుకింగ్ క్లార్కు

ముందు ఉంచాను.

ఏదో అనబోయింది.

"టిక్కెట్లు తీసుకోండి. నా డబ్బు రేపు ఇచ్చేద్దురుగాని" అని ఇవతలకు వచ్చేశాను.

బెల్ కొట్టారు. హాలులోనికి వెళ్ళాను.

స్లైడ్స్ వేస్తూంటే మసక చీకటిలో ఆమె, అమ్మాయి సెకండ్ క్లాస్‌లో మను షుల్ని దాటుకుంటూ వెళ్ళి కూచోవడం కనిపించింది.

మరునాడు-

మేస్త్రి సర్కిల్‌లో సుబ్బరాజుతో మాట్లాడుతూ నిల్చున్నాను. నా కళ్ళు ఆమెకోసం వెదుకుతున్నాయి.

"నమస్కారమండీ!"

వెనుకనుండి ఆమె స్వరం వినిపించింది.

చటుక్కున వెనక్కు తిరిగాను.

ఆమె నమస్కారం చేసింది. నాకు కాదు, సుబ్బరాజుకు.

"నమస్కారమమ్మా!... స్కూల్‌కు వెళ్తున్నావా?" అన్నాడు సుబ్బరాజు.

"అవునండీ!"

కండక్టర్ బెల్ కొట్టడంతో బస్‌లోనికెక్కాము.

సుబ్బరాజు మునిరెడ్డిపాళెంలో దిగిపోయాడు.

ఆర్.యస్. స్టాప్‌లో దిగాక ఆ అమ్మాయి నా వద్దకు గబగబా వచ్చి చేయి చాపింది.

తెల్లని అరచేతిలో ఇరవై పైసాల నాణేలున్నాయి.

ఆమె దూరంగా వెళ్ళి నిలబడి చూస్తూంది.

"మా అమ్మ ఇచ్చి రమ్మంది... నిన్న సినిమాలో ఇచ్చారుగా" అంది...

"మంచిదమ్మా!" తలమీద చేయి వేసి దగ్గరకు తీసుకున్నాను.

"నీ పేరు?"

"లలిత."

"మంచిదానివి. ఈ పైసల్ని నువ్వే ఉంచుకుని చాక్‌లెట్లు కొనుక్కో."

విసురుగా ముందుకు నడిచాను...

మరునాడు —

సుబ్బరాజును అడిగాను ఆమెను గురించి.

"ఆమె — నిర్మల — నిర్భాగ్యురాలు శేఖర్! అంత చక్కనిది. అంతకు మించిన గుణం కలది. కాని భర్త పనికి మాలినవాడు. త్రాగుబోతు. అనుమానంతో ఆమెను హింసపెట్టి తరిమి వేశాడు. ఇక్కడే స్కూల్లో టీచరుగా పనిచేస్తూంది... అతడు ఇంకో ఆమెతో ఉంటున్నాడు నెల్లూరులో."

ఇంకేం అడగలేకపోయాను.

* * *

సెప్టెంబర్ నెల మొదట్లో—

నిర్మల నాలుగు రోజులు బస్‌లో రాలేదు. సుబ్బరాజును కారణం అడిగేందుకు సభ్యత అడ్డువచ్చింది. మధనపడే

మనసును అణచిపెట్టాను.

మరునాడు ఆమె వచ్చింది ఒంటరిగా. అమ్మాయి రాలేదు.

పదిరోజుల వరకూ ఒంటరిగానే వచ్చి తరువాత రావడం మానేసింది.

ఇక నిగ్రహించుకోలేకపోయాను. సుబ్బరాజుకోసం వెళ్ళాను.

పదిహేనురోజులు సెలవుపెట్టి ఊరికి వెళ్లారని తెలిసింది...

మరునాడు సుబ్బరాజునుండి ఉత్తరం వచ్చింది.

నెల్లూరు నుండి వ్రాశాడు.

"శేఖర్!

నిర్మల నీకు జ్ఞాపకం ఉండే ఉంటుంది. భగవంతుడు ఆమెను అంతు లేని దుఃఖంలో ముంచాడు.

నెల క్రితం ఆమె భర్త బెంగుళూరుకి వచ్చి బలవంతంగా పాపను తెచ్చేశాడు. అతడెలాంటివాడైనా పాప అంటే అత నికీ ప్రాణమే.

వారంరోజుల కిందట పాప, అతడు బస్‌లో వెళ్తూంటే సీతారాంపురం వద్ద బస్ బోల్తాపడింది. తంతి అందుకొని నిర్మల, నేను వచ్చాం.

నెల్లూరు ఆస్పత్రిలో మొన్న పాప చని పోయింది ఈవేళ అతను చనిపోయాడు.

నిర్మల ఇప్పుడు ఒంటరిగా మిగిలి పోయింది ఈ ప్రపంచంలో.

ఇకపై ఒకటోతేదీ వస్తున్నా

—రాజు"

పాల బుగ్గలతో అందంగా ఉండే పాప యిక లేదు. బాధతో మనసు మెలి దిరిగిపోయింది.

* * *

ఆరు నెలలు గడిచాయి.

నిర్మల రోజూ అదే బస్‌లో వెళ్తోంది. ఇప్పుడు నుదుట కుంకుమ లేదు. వెంట పాప లేదు. విశాలమైన ఆ కళ్ళల్లో నిరాశ, ఆవేదన.

నన్ను రేషన్ సప్లయిల డ్యూటీ నుండి ఆఫీసుకు వేశారు.

ఇప్పుడు నేను బస్‌లో వెళ్ళడంలేదు. రోజూ నిర్మలను చూసే అవకాశం ఇప్పుడు లేదు.

సుబ్బరాజుకు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ వచ్చింది.

పూనాకు వేశారు.

"శేఖర్! నేను వెళ్తున్నాను. నిర్మల విషయమే నాకు బెంగగా ఉంది. ఆమె నాకు దూరపు బంధువు. ఆ అభాగ్యురా లికి ఎవ్వరూ లేరు. ఆమె జీవితం చీకటిగా గడిచిపోవడం నా కిష్టంలేదు. ఆమెకు మళ్ళీ పెళ్ళిచెయ్యాలని ఉంది. మీరేమంటారు!"

మౌనంగా ఆలోచించాను...

నాలుగురోజుల తరువాత సుబ్బ రాజుకు చెప్పాను.

"రాజూ! నిర్మలను నేను వివాహం చేసుకుంటాను."

సుబ్బరాజు ఆనందంతో ఉక్కిరి

బిక్కిరి అయ్యాడు.

'శేఖర్' అంటూ నా చెయ్యి పట్టుకున్నాడు. అతని కన్నుల్లో స్రవించిన బాష్పాలు వెచ్చగా నా చేతిమీద పడ్డాయి.

"ఆదివారం నిర్మలను కలుసుకుని మాట్లాడండి."

"నిర్మల పునర్వివాహానికి ఒప్పుకుందా?"

"ఒప్పుకున్నట్లే."

ఆ రాత్రే సుబ్బరాజు పూనాకు బయలుదేరి వెళ్ళారు.

* * *

"శేఖర్ బాబూ!

ఒక ఉత్తమ వ్యక్తి హృదయంలో స్థానం పొందగలిగానన్న ఒకే ఒక సంతృప్తితో నా జీవితం ధన్యమైందని భావిస్తున్నాను.

మీరు నిజంగా ఉత్తములు.

సుబ్బరాజు అన్నయ్య చెప్పడమే కాదు, ఈ పది నెలలుగా మిమ్మల్ని గమనించాను.

ఉత్తమ సంస్కారానికి, ఉన్నత భావాలకు ప్రతిబింబం మీరు.

అందుకే పాప పంకిలమైన నా జీవితాన్ని మీకు అంటగట్టి మీ ఉన్నతిని నాశనం చెయ్యలేకపోతున్నాను.

నా జీవితం ఒక విషజ్వాల. అందులో ప్రవేశించిన ప్రతివారు భస్మం కాక తప్పదు.

భగవాన్! కని పెంచిన తలిదండ్రులు, కట్టుకున్న భర్త, కన్నబిడ్డ-అందరూ ఈ జ్వాలలో ఆహుతి అయ్యారు.

వద్దు శేఖర్ బాబూ! వద్దు. మీరు ఇందులో మరొక ఇంధనం కావద్దు.

అమృతహృదయం మీది. అందులో నాకు పాలు పంచారు. నా శేష జీవితంలో అమరణాంతం మధురస్మృతిగా పదిలపరచుకుంటాను.

నాకు ఆంధ్రలో ఉద్యోగం దొరికింది. వెళ్ళిపోతున్నాను.

సెలవు.

—నిర్మల"

నిర్మలను కలుసుకోవాలన్న నాకు అందిన ఉత్తరం ఇది.

సుబ్బారాజుకు ఉత్తరం వ్రాశాను.

జవాబు వచ్చింది.

"శేఖర్,

నిర్మలను మరచిపొండి. మీ మనస్సుకు కష్టం కల్గించాను. మన్నించండి.

—రాజు"

* * *

కాలం కదిలిపోతూనే ఉంది.

ఈనాడు నేను ఒకరికి భర్తను. మరొకరికి తండ్రిని.

కాని జీవనగతిలో నిర్మల స్మృతి మరపురాని ఒకనాటి కథ.